# అంతా మనకోసమేనా?

అర్థితుడుగాక జలమిచ్చు నంబుధరుడు అంటుంది ఒక తెలుగు పద్యం. దానికి సంస్కృతం కూడా ఉంది గానీ సందర్భం అదికాదు. మేఘం అడగనవసరం లేకుండానే నీళ్లు ఇస్తుందని సంబరం. ఈ మేఘం అడిగినప్పుడు చుక్కకూడా నీరు ఇవ్వదని మాత్రం ఆ పద్యం చెప్పదు. అలాగే చెట్టు గురించి చెపుతూ రాయి విసిరిన వారికి కాయో పండో పడేస్తుంది అని చెపుతుంటారు. వినడానికి ఈ మాట నిజమేననిపిస్తుంది. కానీ వీడు నా మీదకు రాయి విసిరాడు అన్న సంగతి చెట్టుకు తెలుసా? తెలిసి ఉంటే పడేసే ఆ కాయనే రాయి విసిరినవాని తల మీద పడేట్టు వేసేదేమో! చెట్టు ఆలోచించి పని చేయడానికి పుట్టలేదు. వాటి మానాన అవి బతకడానికి పుట్టాయి. మనిషి తెలివిగా వాటిని వాడుకోవడం నేర్చుకున్నాడు. చెట్టుకు కాయలు కాస్తాయి. పండ్లవుతాయ. పడి పోతాయి. ఏదో ఒక రకంగా వాటిలోని విత్తులు మరింత దూరం పోయి అక్కడ మరో చెట్టు పుట్టడం మాత్రమే ఈ కాయలు, పండ్లు, వాటికన్నా ముందు వచ్చే పూలు మొదలయిన వాటి ఉద్దేశ్యం. చెట్లు మనిషి కోసం మాత్రం పుట్టలేదని గుర్తుంచుకోవాలి. పురుగులు, వాటికన్నా చిన్నజీవులు లాగే చెట్టలు కూడా తమ జాతి కొనసాగాలని కొన్ని పనులు చేస్తాయి.

పరిణామ చరిత్ర విచిత్రమయినది. ఈ చెట్లనూ జంతువులనూ మనిషి తినకుండా వదిలేశాడనే అనుకుందాం. ఈ భూమి మీద పురుగుల రాజ్యం వచ్చి ఉండేది. మనిషిజాతి మాసరాకు కూడా మిగిలేది కాదు. మొత్తానికి తేలిందేమిటంటే మనిషి ఇలాగే ఉండాలి. చెట్లు జంతువులు అలాగే ఉండాలి. ఇన్ని రోజులు ఒక పద్ధతి నడిచింది గనుక పరిస్థితిలో ఒకరకంగా సమతులనం వచ్చింది. మనిషి ఈరకంగా బతకాలంటే ఉండవలసిన తీరు ఇంచుమించుగానయినా ఉంది. ఇలా కొనసాగుతుందని కాదుగానీ మొత్తానికి కొనసాగుతుంది. అటు ఇటు అయితే నష్టం మనిషికే. ఒక రకం చెట్టు లేకుండా పోయిందనుకుందాము. ఆ రకం ఆధారంగా తీరవలసిన అవసరాల కోసం మరెక్కడో వెతకవలసి వస్తుంది. ఆ వెదికేది మనిషి. మరో చెట్టు మాత్రం కాదు. అందుకే ప్రకృతి పరిరక్షణా జీవవైవిధ్యం మొదలయిన మాటలు మనిషి ప్రయత్న పూర్వకంగా తనకోసం పుట్టించాడు.

అడవిలో ఎన్నో రకాల చెట్లుంటాయి. కొన్నిటి పేర్లుకూడా మనకు తెలియవు. ప్రయోజనం అంతకన్నా తెలియదు. డిగ్రీ స్థాయిలో వృక్షశాస్త్రం చదువుకునేవారికి హెర్బేరియం అనే పేరుతో వృక్ష వైవిధ్యం గురించి తెలియజేసే పద్ధతి ఒకటి ఉంటుంది. రకరకాల చెట్లనుంచి ఆకులతోబాటు వీలయితే పూలతోబాటు ఒక చిన్నకొమ్మను సేకరించాలి. పంతులుగారి సాయంతో ఆ చెట్టును గుర్తించి వృక్షశాస్త్ర పద్ధతిలో వర్గీకరణచేసి వాటిని రికార్డుగా అందించాలి. నేను పల్లెటూరి వాణ్ణి. అంతో ఇంతో వ్యవసాయం కూడా ఉండేది అప్పట్లో. కనుక సాయం చేయగల మనుషులూ ఉండేవారు. అటువంటి ఒక స్నేహితుడిని ఒప్పించి అడవికి వెంట తీసుకుపోయాను. కనిపించిన ప్రతి చెట్టునుంచీ ఒక కొమ్మను విరిచి గొంగట్లో మూటకట్టుకుని ఇల్లు చేర్చాను. వాటిలోంచి అర్థంలేనివనిపించిన కొన్నింటిని పడేసి మిగతా వాటినే పద్ధతిగా తయారుచేసి పట్టుకుపోయాను. గురువుగారు చాలా తెలివి గలవారే. అందుకు సందేహంలేదు. ఆయన ఏమన్నారనేది ఇవాళ సరిగ్గా గుర్తురావడం లేదు గానీ నేను పడిన చాలా కష్టం దండగయిందని మాత్రం గట్టిగా గుర్తుంది. గురువుగారు నేను పట్టుకు పోయిన చెట్లలో చాలారకాలను గుర్తించ లేకపోయుండవచ్చు. అందులో ఏ మాత్రం ఆశ్చర్యం అవసరంలేదు. అడవిలో ఉండే చెట్లన్నీ తెలిసిన మనిషి ఎవరయునా ఉంటే వాళ్లకు ఊరికే ఓ పిఎచ్.డి

ఇచ్చేయెుచ్చేమో. మా ఊరి పెద్దమనిషి ఆశన్న వీధి నాటకంలో ఓ సందర్భంలో వందల చెట్ల పేర్లు గుక్క తిప్పకుండా ఏకరువు పెట్టేవాడు. వాటిని చూపించమని అడిగితే ఆయన కూడా గురువు గారిలాగే దాటేసేవాడేనని నాకివాళ అనిపిస్తుంది. చాలా రకాల చెట్లు వెంటనే మనకు ప్రయోజనం లేనివిగా ఉంటాయి. కొన్ని ఉన్ననాడు బాగానే ఉంటాయిగానీ లేనినాడు గుర్తుకురావు.

చిన్నప్పుడు సీతాఫలాలు తినడానికని అడవికి వెళ్లేవాళ్లం. సీతాఫలాలంటే అందరికీ తెలిసిన రకం. కనుక వాటికోసం పోవలో గొప్ప ఆశ్చర్యం అవసరం లేదు. నక్కరిపండ్లు అని మరో రకం ఉండేవి. గుండ్రంగా పసుపు కలిసిన ఎరుపు రంగులో గోలీకాయలంత ఉండే ఆ పండ్లు పులుపు కలిసిన తీపి రుచి కలిగి ఉండేవి. గుత్తులు గుత్తులుగా చెట్లకు మహా ఆకర్షణీయంగా ఉండేవి. వాటిని తింటే కడుపు నిండింది లేదు. కాలు నిండింది లేదు. ఊరికే దొరుకుతున్నాయని కొంత, రుచి కోసం కొంత వాటి మీద ప్రేమ. ఒక పూటంతా వాటి కోసం గడిపి దొరికినన్ని తిని ఇంటికి చేరుకున్న తర్వాత తిండి నోట్లో పెట్టుకుంటే మంట పుట్టేది. ఆ పండ్లలో పులుపు నాలుక మీద పని చేసేదని ఫలితంగా నాలుక పగిలేదని ఇవాళ అర్థమవుతున్నది. అయినా నక్కరి పండ్లను తలుచుకుంటే నోట్లో నీళ్లూరుతాయి. తుత్తురు పండ్లు, బలుసురు పండ్లు, సీమ చింతకాయలు, ఉల్లింత పండ్లు ఇంకా ఎన్నో రకాలు. అయితే ఒక్క రకం కూడా కొని తిన్నగుర్తు లేదు. రేగి పండ్లు మొదలయునవి కూడా ఎవరి పొలంలో నయినా ఉంటే అడిగి కొట్టుకోవడం, ఎవరి పొలమూ కాకపోతే ఇష్టారాజ్యం. సీతాఫలాలు, జిట్టరేగి పండ్లూ కొని తింటున్నారంటే ఇవాళటికీ నాకది విచిత్రంగా కనిపిస్తుంది. నీళ్లుపోసి పెంచిన వాటిని కూడా అమ్మాలనే ఆలోచన తప్పనిపించిన రోజులవి. ఉసిరికాయలు కూడా అంతే. అడవికి పోయి, నాలుగు కాయలు రాల్చి ఇంకా లేతగా ఉన్నాయని వాటిని అట్లాగే వదిలి రావడం కొత్తకాదు. మందులు చేసే వారికి ఊరగాయ వేసుకునే వారికి తప్ప ఎవరికి కావాలా కాయలు? అందుకే తిరిగి వెళ్లే దాకా ఏ కాపలా అవసరం లేకుండానే అవి అక్కడే నిక్షేపంగా ఉండేవి. ఊరగాయ పెట్టుకోవడం ఊర్లో అందరికీ చేతనయ్యే పని గాదాయె.

కూరగాయల సంగతి కూడా ఇట్లాగే ఉండేది. ఊరినించి అడవికి వెళ్లేదారి ఒకటి ఉంటుంది. అటూ ఇటూ పొలాలు. వాటికీ దారికీ మధ్యన కంప లేదా రాళ్లతో పేర్చిన కంచె ఉంటాయి. అటువంటి కంచెలో రకరకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిలో వెదికి చూడ గలిగితే చాలా రకాలు కూరలు వండుకోవడానికి పనికివచ్చేవే. ఆగాకరకాయలు, లేదా బొంతకాకరకాయలను అంతలేసి ధరలకు అమ్ముతుంటే నాకు కర్ర పుచ్చుకుని కాకరకాయల కోసమని నాన్నగారితోబాటు సంచీ భుజాన వేసుకుని బయలుదేరిన రోజులు గుర్తొస్తాయి. ఆకుకూరల గురించయితే అడగనవసరం లేదు. అన్ని రకాలూ ఊరికే ఏరితెచ్చుకునేవే. బొట్లబెండ అని ఒక మొక్క. దాని ఆకులు పెద్దవి. మొక్క మాత్రం చిన్నదే. ఆకులు తినడానికి పనికిరావు. వాటి కాడలను మాత్రం పైనుండే పొరను తీసేసి పులుసులో వేసుకుంటే భలే రుచిగా ఉండేది. అది పొలాల్లో పెరిగే పిచ్చిమొక్క. వెన్నపూస అలము అని ఒక మొక్క ఇట్లాగే పెరుగుతూ ఉండేది. అది నిజానికి ఎందుకూ పనికిరాని మొక్క. కానీ మా ఇంట్లో దాని ఆకులతో బజ్జీలు చేసేవారు. నిత్యమల్లె ఆకుల బజ్జీలు కూడా మాకు అలవాటే. పట్నం చేరిన తర్వాత ఇట్లాంటి పండ్లు కాయలు, కూరల గురించి జ్ఞాపకంగూడా రాలేదు. పాలకూర, తోటకూర అంటారే కానీ దొగ్గలికూర, చెంచెలికూర పట్నంలో ఎవరికయినా తెలుసునంటే అనుమానమే.

ఈ ప్రపంచంలో ఉండే పదార్థాలన్నీ మన కోసం తయారయినవి కావు. వాటిని మనం వాడుకోగలిగితే అది మన తెలివి. తెలిసిన వాటిని పోగొట్టుకోవడం తెలివి తక్కువ!